ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

గురువారం 29 మే 2025

చికెన్ ధరలు	
లైవ్	150
డ్రెస్	220
స్కిన్‌లెస్	250
గుడ్లు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	23.0

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు
- మిఠాయిలు పంచుకున్న అభిమానులు



కోదాడలో సంబురాల్లో ఎన్టీఆర్ అభిమానులు

8

లింగమంతులస్వామీ
నీ ఆస్తులకేదీ రక్షణ?

- ఆకతాయిల చేతిలో వస్తువులు చోరీ, ధ్వంసం
- పట్టించుకోని మునిసిపాలిటీ, దేవాదాయ శాఖలు
- జాతర నిర్వహణకే పరిమితమవుతున్న యంత్రాంగం



రాష్ట్రంలో మేడారం తర్వాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు లింగమంతుల స్వామి(గొల్లగట్టు) ఆలయ ఆస్తులకు రక్షణ లేకుండాపోతోంది. జాతర సమయాల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తూ చేపట్టిన మరుగుదొడ్లు, మూత్రశాలలు, నల్లాలు, నీటి ట్యాంకులు, విద్యుత్ దీపాలు, సోలార్ దీపాలకు రక్షణ లేకుండాపోతోంది. వీటి రక్షణకు మునిసిపాలిటీ గాని, దేవాదాయ శాఖ గాని నిఘా చర్యలు చేపట్టకపోవడంతో ఆకతాయిల చేతిలో చోరీలకు, ధ్వంసానికి గురవుతున్నాయి. ఎవరికి వారు ప్రభుత్వం ఇచ్చే నిధులు జాతర ఏర్పాట్లకు, పారిశుధ్య సౌకర్యాలకే సరిపోతోందని చెబుతూ పెద్దగట్టు రక్షణను వదిలేస్తున్నారు. దీంతో సాయంత్రమైతే చీకటిమయంగా మారి ఆకతాయిలకు నెలవుగా మారుతోంది.

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

సూర్యాపేట పట్టణంలో నాలుగవ వార్డు పరిధిలోని లింగమంతులస్వామి దేవాలయానికి నిత్యం భక్తులు వచ్చిపోతుంటారు. అన్నిసౌకర్యాలు కల్పిస్తే పట్టణవాసులతో పాటు ఇతర గ్రామాల నుంచి వస్తున్న భక్తులు సేదతీరి ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉన్నా మునిసిపాలిటీ, దేవదాయ శాఖలు దృష్టి సారించడం లేదు. పెద్దగట్టు జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అయితే సౌకర్యాలు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. జాతర సమయంలో ఏర్పాటు చేసిన ఈ సౌకర్యాలు సైతం పర్యవేక్షణ లేకపోవడంతో దెబ్బతింటున్నాయి. విద్యుద్దీపాలు వెలగక సాయంత్రమైతే పెద్దగట్టు చుట్టుపక్కల ప్రాంతాలు చీకటిమయంగా మారుతున్నాయి. దీంతో కుళాయిలు, నల్లాలు, మూత్రశాలల్లోని వస్తువులు, నీటి ట్యాంకులు, ఇతరత్రా వస్తువులను ఆకతాయిలు, దొంగలు ధ్వంసం చేస్తున్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే జాతర ఏర్పాట్లను మునిసిపాలిటీ, దేవదాయశాఖలు పర్యవేక్షణ చేసి ఆ తర్వాత మరిచిపోతున్నాయి. దేవాలయ పాలకవర్గాలను సైతం ఏర్పాటు చేయకుండా తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేయడంతో వారు పట్టు సాధించేలోపే జాతర అయిపోతోంది. పెద్దగట్టు సమీపంలో జాతర సమీపంలో నిర్మించిన షెడ్ల రక్షణకు మునిసిపాలిటీ ఇద్దరు సిబ్బందిని కేటాయిస్తే మరో జాతర వచ్చే వరకూ నిర్మాణాలు, వస్తువులకు రక్షణ ఉంటుంది. ఎలాంటి రక్షణ లేకపోవడంతో ధ్వంసం కావడంతో పాటు చోరీకి గురవుతున్నాయి. ప్రతీ జాతరకు రూ.కోట్ల పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే ..

మిగతా 8వ పేజీలో

● ప్రభుత్వ షెడ్ ప్రైవేట్ వ్యక్తి నిర్వహణలో

లింగమంతులస్వామి జాతరకు వచ్చే భక్తులు సేదతీరడానికి ప్రభుత్వ భూమిలో షెడ్ నిర్మాణం చేపట్టారు. అయితే ఆ షెడ్ నిర్వహణ ప్రస్తుతం ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెల్లంది. భక్తులకు అద్దెకి ఇస్తూ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వాటిని సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. భక్తులు ఎండలకు, వానలకు ఇబ్బంది పడకుండా ఏర్పాటుచేసిన షెడ్డు బడానాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెండు శాఖల మధ్య..

పెద్దగట్టు ఆలయ నిర్వహణ రెండు శాఖల మధ్య నలిగిపోతోంది. ఆలయ పరిసరాలను దేవాదాయశాఖ, గట్టు కింది భాగాన్ని సూర్యాపేట మునిసిపాలిటీ జాతర సమయంలో పర్యవేక్షిస్తున్నాయి. దేవాదాయ శాఖ పరిధిలోని హుండీ లెక్కలు, తలనీలాలు, తలవెంట్రుకలు, కొబ్బరిచిప్పల వేలం ద్వారా వచ్చే ఆదాయాలు మాత్రమే వస్తున్నాయి. జైబజార్, సర్కస్‌లాంటి వాటి ద్వారా వచ్చే ఆదాయం మునిసిపాలిటీకి చేరుతుండగా ఆ డబ్బులు శానిటేషన్ ఇతర పనులకే సరిపోతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వేలం ద్వారా వచ్చే ఆదాయానికి తోడు జాతరకు మునిసిపాలిటీ లక్షల్లో ఖర్చు చేస్తోంది. అయితే వేలం పాటల ఆదాయంతో పాటు ఇతర నిధుల ఖర్చుల వివరాలకు మాత్రం లెక్కలు చెప్పడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మునిసిపాలిటీకి వచ్చే ఆదాయంలో కొంత దేవాదాయ శాఖకు కేటాయించాలని భక్తులు సూచిస్తున్నారు. లేదంటే జాతర మొత్తం దేవాదాయ శాఖ పరిధికి తెస్తే పెద్దగట్టు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు స్వయం ఉపాధి లక్ష్యం

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వయం ఉపాధి లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామని, పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామక్రిష్ణారావులతో కలిసి బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేటగిరీలను కలుపుకుని రాజీవ్ యువ వికాసం పథకానికి 16లక్షల 23వేల 764 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరీ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఐదు విడతల్లో ఐదు లక్షల మంది లబ్దిదారులకు ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.6,260 కోట్లను బ్యాంకు లింకేజీ కింద రూ.1667 కోట్లను కలుపుకుని మొత్తం రూ.8 వేల కోట్లను వెచ్చిస్తుందన్నారు. బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించిన తర్వాత యూనిట్లు గ్రౌండింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఎల్‌డీఎం బాపూజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసనాయక్, డీటీడీవో శంకర్, మైనార్టీ సంక్షేమాధికారి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులుగా పడిగాపులు కాస్తున్నాం



రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అర్వపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల నుంచి ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో పడిగాపులు కాస్తున్నాం, లారీల కొరత సాకుతో తీసుకెళ్లక ధాన్యం మొలకెత్తిన ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామంలోని మల్లంపల్లి-నకిరేకల్(365 నెంబరు) జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని నేటికీ కొనుగోలు చేయకపోవడంతో తడిసి ముద్దవుతోందన్నారు. మొలకెత్తి దెబ్బతింటోందన్నారు. ఎన్నడూలేనివిధంగా లారీల కొరత పేరుతో ధాన్యం కాంటా వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ రఘువీరారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేయించారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో రైతులు గోసుల విజయ్, లక్ష్మీనర్సింహ, అంకిరెడ్డి రాజారాం, నాగార్జున, మల్లేష్, అయోధ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

భానుపురి, మే 28 (ఆంధ్రజ్యోతి): చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 450కి ఎక్కువ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు రూ.4.50 లక్షల నగదును శ్రీ కృష్ణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పంపిణీ చేశారు. యాదవులు విద్య, రాజకీయంగా, ఆర్థికంగా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ ఇంటర్ నుంచి ఐదేళ్లు కష్టపడి, ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ మాట్లాడుతూ బడుగుచ బలహీనవర్గాల్లో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సేవా ట్రస్టు ద్వారానే కాకుండా పేద విద్యార్థులకు సాయం అందించడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కెరీర్ గైడెన్స్‌పై నకిరేకల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్యయాదవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీ కృష్ణ ట్రస్టు చైర్మన్ వూర రాంమూర్తియాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మర్యాద సైదులుయాదవ్, పోలెబోయిన నర్సయ్యయాదవ్, వూర గాయత్రియాదవ్, వజ్జ వీరయ్యయాదవ్, గొడ్డెటి సైదులుయాదవ్, తూము వెంకన్నయాదవ్, రాము యాదవ్, మహేష్ యాదవ్, వెంకన్న, మధుయాదవ్, కొడి సైదులు యాదవ్, లింగయ్యయాదవ్, కంచుగట్ల జానయ్యయాదవ్, శ్రీమాన్ యాదవ్, తదితరులు ఉన్నారు.

అదనపు ఎస్పీగా బాధ్యతల స్వీకరణ



ఎస్పీ నర్సింహను కలిసిన ఏఎస్పీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : అదనపు ఎస్పీగా యు రవీందర్‌రెడ్డి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కొత్తపల్లి నర్సింహను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ఇటీవల హైదరాబాద్‌కు బదిలీ అయిన అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావును ఎస్పీ నర్సింహతో పాటు అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, మరికొంత మంది పోలీస్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నర్సింహచారి, ఎస్‌బీఐ నాగభూషణరావు, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లకొండ రాంచందర్‌గౌడ్ ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి వెబెక్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు, గ్రామకార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ఇందిరమ్మ ఇళ్ల 12,868గాను మొదటి విడతలో 4,322 మంది లబ్ధిదారులకు మంజూరుచేశామన్నారు. నిర్మాణాలు వివిధదశల్లో ఉన్నాయన్నారు. త్వరగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ప్రతీ సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతాయన్నారు. రాజీవ్‌యువ వికాసంలో భాగంగా జిల్లాలో 60,085 దరఖాస్తులకు 57,985 దరఖాస్తులను విచారణ చేసి బ్యాంకులకు పంపినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో అప్పారావు, హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి, జిల్లా సంక్షేమాధికారులు శ్రీనివాసనాయక్, జగదీశ్వర్‌రెడ్డి, ఎల్‌డీఎం బాపూజీ, డీపీవో యాదయ్య ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సూర్యాపేట(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. వానాకాలం సీజన్‌లో సరిపడా కాంప్లెక్స్ ఎరువులు, యూరియా, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఏరకం విత్తనాలపై ఆసక్తి చూపిస్తున్నారనే విషయాన్ని దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన డీలర్లు ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాధవ్, ఏవో గణేష్, కృష్ణసందీప్ ఉన్నారు.



కొక్యానాయక్‌తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

తిరుమలగిరి రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారమే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ తెలిపారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని కొక్యానాయక్ తండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లను 600 చదరపు అడుగుల్లో మాత్రమే నిర్మించుకుంటేనే రూ. 5 లక్షల ప్రభుత్వ ఆర్థిక సహకారం అందుకోవడానికి అర్హులు అవుతారన్నారు. కొక్యానాయక్‌తండా గ్రామంలోని ఇస్లావత్ యాకమ్మ, ఇస్లావత్ జగన్‌లు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, సివిల్ సప్లై డీఎం ప్రసాద్, మండల తహసీల్దారు హరిప్రసాద్, ఏపీఎం మధు, కిరణ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వ్యవసాయాధికారులు పంట సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాదవ్, ఎంపీడీవో గోపి, ఏవో గణేష్, కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ


శిశు విక్రయ ముఠాకు బేడీలు

- 13 మంది ముఠాసభ్యుల అరెస్ట్
- 28 మంది శిశువుల విక్రయం
- 10 మందిని సంరక్షించిన సూర్యాపేట పోలీసులు
- నిందితుల్లో ఒకరు యూపీలోని లక్నో జైలులోనే..
- కన్నీరుమున్నీరవుతున్న పెంచిన తల్లిదండ్రులు
- శిశువిహార్‌కు చిన్నారుల తరలింపు

వివరాలు మెయిన్ 14లో

స్థానిక పోరుకు సన్నాహాలు





- జూన్‌లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం
- సత్తా చాటేందుకు అధికార, ప్రతిపక్షాల కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం, సాగునీటి కాల్వల పునరుద్ధరణ, రాజీవ్‌ఆరోగ్యశ్రీ, భూభారతి వంటి పథకాలు ప్రవేశపెట్టింది. ఈ పథకాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని అన్ని పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

స్థానికసంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశం ఉండటంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే గ్రామాల బాటపట్టారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాలు సైతం అధికార పక్షం ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి సారించి, విమర్శలతో హోరెత్తిస్తోంది. ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అధికార, విపక్షాలు స్థానిక ఎన్నికల సమరానికి సై అంటుండటంతో గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ సెగ మెల్లగా రాజుకుంటోంది.

సామాజిక న్యాయం పాటించాలని

స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, అధిష్ఠానం నియమించిన అభ్యర్థులను గెలుపించుకోవాలని కాంగ్రెస్ ఆ పార్టీ నేతలకు సూచించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్ని జిల్లాల్లోని ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అభ్యర్థుల అంశంలో సామాజిక న్యాయం పాటించాలని, ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనపై కసరత్తు చేయాలని సూచించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో అందుబాటులో ఉన్నవారికే ప్రాధాన్యమివ్వాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అభ్యర్థుల ఎంపిక అత్యంత కీలకంగా మారనుంది.

సత్తా చాటాలని

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. అధికార పార్టీకి దీటుగా గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్నాయి. రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లతోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై బీఆర్‌ఎస్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, అమలుతీరుపై సమీక్షలు చేస్తోంది. ప్రజల్లో వెళ్లి ప్రభుత్వం చేయలేకపోయిన పనులను నిలదీస్తూ,పూర్వ వైభవాన్ని చాటుకోవాలని ప్రయత్నాలు ముమ్మరంగా చేసింది. వారంలోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకుంది. ఆ హవాను కొనసాగిస్తూ పార్టీని విస్తరిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో సీట్లు గెలుచుకునేందుకు సన్నద్ధమవుతోంది.

ఎన్నికలకు సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసిన అధికారులు, మిగిలిన పనుల్లో వేగం పెంచారు. జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి జిల్లాలకు చేరుతోంది. షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికల సిబ్బందికి శిక్షణకు సంబంధించిన మాడ్యూల్స్ ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారుల హ్యాండ్ బుక్స్ జిల్లాలకు చేరాయి. ఎన్నికల సామగ్రి విడతల వారీగా చేరుతోంది. రెండు నెలల్లోగా స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు సమాచారం. ఓటరు తుదిజాబితా సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల వివరాలు అందిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1-200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో పోలింగ్ అధికారి ఉంటారు. 201నుంచి 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి 650మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. ప్రతీ వార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. ఒక వార్డులో 650మంది ఓటర్లు ఉన్నచోట రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ఈ మేరకు జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

హామీల అమలులో చేతులెత్తేసిన

కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ ఇచ్చిన రూ.లక్ష తప్ప తులం బంగారం ఊసే లేదన్నారు. ఇప్పటికీ కేసీఆర్ పథకాలే తప్ప ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచంలోనే మరెక్కడా లేవన్నారు. రైతు భరోసా కాదు నేడు వ్యవసాయానికి భరోసా లేకుండా పోయిందని విమర్శించారు. నారుమడిలా మారిన కల్లాలను చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, తూడి నర్సింహారావు, శ్రీనివాస్‌యాదవ్, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రలో దడదడ

- రంబుల్ స్ట్రిప్స్ వద్ద వాహన శబ్దాలతో ఇబ్బందులు

6


గిరాకేదీ గువ్వలచెన్నా?

కులవృత్తులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. ఎంతోమంది కులవృత్తులపై ఆధారపడి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకునేవారు. అందుకే కులవృత్తి మానకురా గువ్వల చెన్నా అన్నది ఒకప్పటి నానుడి. రానురాను మారుతున్న కాలనుగుణంగా కులవృత్తులకు ఆదరణ కరువైంది. ప్రధానంగా ఏ కార్యమైనా ఉపయోగించే కుండల తయారు చేసే కుమ్మరుల పరిస్థితి ఇబ్బంది మారింది. రేడిమెడ్, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్లను ముంచెత్తుతుండటంతో చేతిపై తయారు చేసే వస్తువులకు గిరాకీ తగ్గింది. దీంతో ఉపాధి లేక పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

● మట్టిపాత్రలకు తగ్గిన డిమాండ్ ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు ● ఉపాధి కోసం కులవృత్తికి స్వస్తి చెబుతున్న కుమ్మరులు





ఆదరణ కరువై కులవృత్తులు చేసేవారు ఇతర ఉపాధి మార్గాల వైపు మళ్లుతున్నారు. అనాదిగా వస్తున్న చేతివృత్తికి స్వస్తిపలుకుతున్నారు. శుభ, అశుభ కార్యమైనా ముందుగా వాడేది మట్టి పాత్రలు. ఆ పాత్రలు తయారు చేసే కుమ్మరుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారింది. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 200 వందలకు పైగా కుటుంబాలు ఉండగా 1000కి పైగా జనాభా ఉంది. కులవృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్న 25 కుటుంబాలు ఉన్నాయి. మండలంలోని చల్లూరు, బొందుగుల, పాంకుంట, సింగారం, పారుపల్లి గ్రామాల్లో కొంతమంది కులవృత్తిని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మట్టితో సారెపై

వివిధ రకాల మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు. ఆయా పాత్రల తయారీకి వినియోగించే నల్ల మెత్తటిమట్టి కొంతకాలంగా చెరువులు నిండకపోవటంతో స్థానికంగా లభించడంలేదు. దీంతో 20 కిలోమీటర్ల దూరంలోని సిద్ధిపేట జిల్లా నాగపురి గ్రామంలోని చెరువుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఐదు దశాబ్దాలుగా వృత్తిలో...

రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బోనాల వెంకటయ్య వయస్సు 70 ఏళ్లు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. వారికి కల వృత్తే ఆధారం. తాను 17 ఏళ్ల వయస్సు ఉన్నప్పటి నుంచి కుల వృత్తిని చేపట్టారు. వయస్సు మీద పడినా వృత్తిని మాత్రం విడవలేదు. సారెపై మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు.రోజంతా కష్టపడిన కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. తయారుచేసిన మట్టి పాత్రలకు గిరాకీ లేకపోవడంతో జీవనం ఇబ్బందిగా మారింది. కుమ్మరులకు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు.



కుటుంబ సభ్యులతో కలిసి

ఒండ్రుమట్టిని ఎండలో ఆరబోసి బాగా చూర్ణం చేసి నీటితో తడిసి ఒక రోజు మక్కబెడతారు. ఆ తర్వాత రోజు మట్టిని మెత్తగా అయ్యే వరకూ ఉదయం తొక్కుతారు. ఇందులో ఇంట్లో సభ్యులందరూ పాల్గొంటారు. మెత్తగా తయారు చేసుకున్న మట్టిని సారెపై పెట్టి పాత్రలను తయారు చేస్తుంటారు. ఆ మెత్తటి పాత్రలను సల్పతో నున్నగా తీర్చిదిద్దుతారు. అనంతరం ఈ పాత్రలను నీడలో కొద్దిరోజులు, ఎండలో కొద్దిరోజులు ఆరబెట్టి వాములో కాల్చుతారు. ఆ తర్వాత మట్టిపాత్రలు పూర్తిస్థాయిలో వినియోగానికి తయారవుతాయి.

వివిధ రకాల ఆకృతిలో

కుమ్మరులు మట్టితో వివిధ రకాల ఆకృతిలో వస్తువులను తయారు చేస్తుంటారు. కుండలు, కంచులు, గురుగులు, దీపపు ప్రమిదలు, వండే పాత్రలను తయారుచేస్తున్నారు. అయితే వాటిని విక్రయించడం కుమ్మరులకు ఇబ్బందిగా మారింది. రెడీమెడ్, ప్లాస్టిక్ వస్తువులు, అల్యూమినియం, స్టీల్ పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో మట్టితో తయారుచేసిన పాత్రలకు గిరాకీ లేకుండాపోయింది. పండుగలు, జాతర్లు, శుభ, అశుభ కార్యాలకు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నట్లు కుమ్మరులు తెలిపారు. మిగతా రోజుల్లో పెద్దగా గిరాకీ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కరువై చేతి వృత్తిని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళ్తున్న తరుణంలో కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మట్టితో చేసిన వస్తువులు విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని, అందుకు తగ్గ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని రాజాపేట మండల కుమ్మరి సంఘం నాయకులు కోరారు.

ప్రభుత్వం సాయం చేయాలి



కుల వృత్తిపై ఆధారపడిన కుమ్మరుల పరిస్థితి అధ్వానంగా మారింది. నేడు ప్రజల నుంచి ఆదరణ కరువైంది. చేతి వృత్తులకు ఆసరా కల్పించేందుకు ఆధునిక యంత్రాలను అందించాలి. బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి ప్రోత్సహించాలి.

బోనాల వెంకటేష్, కుమ్మరి సంఘం అధ్యక్షులు, రాజాపేట మండలం

కులవృత్తులను కాపాడాలి



కులవృత్తులను ప్రభుత్వ కాపాడాలి. కుమ్మరులు అనాదిగా కులవృత్తినే ఆధారంగా చేసుకుని చాలీచాలని జీవితాలను వెళ్లదీస్తున్నారు. ఉపాధి లేక ఇతర వృత్తులకు మారుతున్నారు. ఇంటిల్లిపాది కష్టపడినా కూలీ గిట్టడంలేదు. కుమ్మరులకు తగిన ప్రోత్సాహాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

చెలిమెళ్లపల్లి లక్ష్మణ్, కుమ్మరి సంఘం నాయకులు, రాజాపేట

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



రఘుపతి(ఫైల్)

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వలిగొండ మండలం గురునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి (42) తనకున్న మూడు ఎకరాలతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. దిగుబడి ఆశించినంత మేర రాక, సాగుకు చేసిన రూ.6లక్షలకు పైగా అప్పులు తీర్చలేక కొద్ది రోజులుగా మానోవేదనకు లోనవుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అదే రోజు సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రఘుపతి భార్య లలిత బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రఘుపతికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన వెంకన్న

మద్దిరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తునికి వెంకన్నగౌడ్(55) బుధవారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య తునికి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. వెంకన్నగౌడ్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సొసైటీ కార్మికులు రేసు లింగయ్య, లింగరాజు, జగన్, రేసు వెంకన్న, మమూనూరి రామయ్య, ఆకుల రమేష్, తాళ్లపల్లి మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు.

గొర్లకాపరిని అకారణంగా కొట్టిన కానిస్టేబుల్



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రవీణ్ తలిదండ్రులు

ఆత్మకూరు(ఎం), మే 28 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రానికి చెందిన ఓ గొర్రెల కాపరిని స్థానిక కానిస్టేబుల్ తీవ్రంగా కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం బాధితుడు, అతడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన మజ్జిగ విజయ, ఆమె కుమారుడు మజ్జిగ ప్రవీణ్(15) కలిసి ఈ నెల 26న నారాయణబావి ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నారు. మధ్యాహ్నం దాహం వేయగా ప్రవీణ్ మంచినీటి కోసమని దగ్గరలోని రైతు వ్యవసాయ బావి బోరు మోటారు ఆన్ చేసి నీళ్లు తాగాడు. అదేవిధంగా తన వెంట తెచ్చిన బాటిల్ నింపుకొని మోటార్ నిలిపివేసి తల్లి దగ్గరకు వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లింగంనాయక్ అనే కానిస్టేబుల్ ప్రవీణ్‌ను అడ్డుకుని మోటారు ఎందుకు పెట్టావురా? అంటూ దూషించాడు. అంతేకాకుండా ఆగ్రహంతో కర్ర తీసుకుని ప్రవీణ్ చేతులపై తీవ్రంగా కొట్టాడు. ఇంతలో తల్లి విజయ వచ్చి అడ్డుకుని నిలదీయడంతో కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దౌర్జన్యంగా తన కుమారుడిని కొట్టిన కానిస్టేబుల్ లింగంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విజయ తెలిపింది. ఫిర్యాదు చేసి మూడు రోజులైనా కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయలేదని విలేకర్లకు వివరించారు. విజయ, ప్రవీణ్ ఆరోణలపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్ లింగంనాయక్‌పై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి ముగ్గురికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామని, 9మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి మూడు రోజులు, మరో ఇద్దరికి ఒక రోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా మిగిలిన ఆరుగురికి కలిపి రూ.6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

నేరేడుచర్లలో డీజే సీజ్, ఇద్దరిపై కేసు

నేరేడుచర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో రామాపురం రోడ్డులో అనుమతులు లేకుండా డీజే పెట్టి సౌండ్ పొల్యూషన్‌కి పాల్పడిన కేసు నమోదు చేసి డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఏపీ20వై 8173 నెంబరు గల డీజే వాహనం పెద్ద శబ్దాలు పెట్టడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా డీజేలు పెట్టవద్దని, పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని దుప్పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పేకాడుతున్న వెల్పుల నర్సింహ, బెంజంకి బిక్షం, బొమ్మగాని మారయ్య, గునగంటి స్వామి, నిమ్మని వెంకటయ్య, కీసరి రామచందర్‌లు పట్టుబడ్డారని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.7800 నగదు, 6 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తోడల్లుళ్లను బలిగొన్న ఓవర్‌టేక్

● ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి



దేవరకొండలో లారీ వెనక చక్రాల కింద పడి మృతి చెందిన శ్రీశైలం

దేవరకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో బుధవారం ఉదయం లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన తోడల్లుళ్లు మృతి చెందారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఈదమోని శ్రీశైలం(44), ఉరుకొండ మండలం రాచమల్ల గ్రామానికి చెందిన ఈరటు బచ్చయ్య(40)లు తోడల్లుళ్లు. ఇద్దరూ గేదెల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటారు. ఇద్దరు కలిసి మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా చింతపల్లి నుంచి బయలుదేరి నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రానికి చేరుకుని గేదెలను విక్రయించారు. బుధవారం తెల్లవారుజామున త్రిపురారం నుంచి బైక్‌పై బయలుదేరారు. దేవరకొండ పట్టణానికి చేరుకోగానే కొండమల్లేపల్లి నుంచి కల్వకుర్తి వైపు వెళుతోన్న ఐరన్‌లోడు లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో లారీ బైక్‌ను ఢీకొనడంతో ఈదమోని శ్రీశైలం లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈరటు బచ్చయ్యకు తీవ్ర గాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీశైలం, బచ్చయ్య కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని దుఃఖసాగరంలో మునిగిపోయారు. శ్రీశైలం కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

గేదెలు బైక్‌ను ఢీకొని విద్యుత్ ఉద్యోగి



సైదులు(ఫైల్‌ఫోటో)

పాలకవీడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం బెట్టెతండాలో బైక్‌ను గేదెలు ఢీకొన్న ఘటనలో విద్యుత్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాన్‌పహాడ్‌కు చెందిన షేక్ సైదులు అలియాస్ జాన్‌సైదా(42) విద్యుత్ శాఖలో లైన్‌మన్ కింద ఆర్టిజన్ ఉద్యోదిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 27న జాన్‌పహాడ్ గ్రామంలో వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులను తీసుకుని మండలకేంద్రంలోని కార్యాలయంలో జమచేసి తిరిగి జాన్‌పహాడ్ గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టెగూడెం వద్ద గేదెలు సైదులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాయి. తీవ్ర గాయాలైన సైదులను అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సైదులు బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ కింద పడి బిహార్ కూలీ

శాలిగౌరారం, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ కింద పడి బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీ మృతి చెందాడు. ఎస్ఐ సైదులు తెలిపన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రంలోని సహ్రస జిల్లా బలుహా గ్రామ బైజ్‌నాథ్‌పట్టికి చెందిన సూరజ్ కుమార్(20) అదే ప్రాంతానికి చెందిన 11మందితో కలిసి చిత్తలూరులోని ఐకేపీ కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్నాడు. అదే సమయంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో వర్షానికి తడవకుండా నలుగురు హమాలీలు లారీ కిందికి వెళ్లారు.

లారీ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు కదిలించాడు. గమనించిన లారీ కింద ఉన్న నలుగురు హమాలీల్లో ముగ్గురు బయటకు రాగా తప్పించుకునే క్రమంలో సూరజ్‌కుమార్ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే విషయం తెలుసుకున్న శాలిగౌరారం పోలీసులు సూరజ్ కుమార్ మృతదేహాన్ని ఆటోలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సూరజ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సూరజ్‌కుమార్ మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పెండ్లి పత్రికలు పంచి వస్తూ...

కనగల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి పత్రికలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ.చెన్నారం గ్రామస్టేజీ సమీపంలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన తౌడోజు వెంకటాచారి(50) నల్లగొండ పట్టణం శాంతినగర్‌లో నివాసముంటూ లాడ్జి మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా తన దగ్గరి బంధువు ఇంట్లో జరిగే పెళ్లి వేడుక ఆహ్వాన పత్రికలను పంచేందుకు దర్వేశిపురం వచ్చి తిరిగి నల్లగొండకు వెళ్తున్నాడు.

ఈ క్రమంలో మార్గమధ్యలోని జీ.చెన్నారం స్టేజీ వద్ద వెంకటాచారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెంకటాచారికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారని బంధువులు తెలిపారు. భార్య పారిజాతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

● ట్రాక్టర్ సహా బావిలో పడి డ్రైవర్...



బావిలో పడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది, డ్రైవర్ గుగులోతు రమేష్ (ఫైల్ ఫొటో)

ఆత్మకూరు(ఎస్), మే 28 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో వాహనం సహా బావిలో పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం రామన్నగూడెం గ్రామ ఆవాసం గౌస్‌తండా సమీపంలో ఈ ఘటన జరిగింది. ఏఎస్ఐ జానకిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎస్) మండలం బోరింగ్‌తండాకు చెందిన గుగులోతు రమేష్(38) నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన బొగ్గుబట్టీ వ్యాపారి బండారు శ్రీను వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రామన్నగూడెం శివారు ఏరు సమీపంలోని చెట్ల మొద్దులను బొగ్గు బట్టీ వద్దకు తరలించేందుకు రమేష్ బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌తో వెళ్లాడు. మొద్దులు వేసేందుకు కూలీలు సిద్ధంకాగా, ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో రమేష్ ప్రమాదవశాత్తు సమీపంలోని బోరేజు మల్లయ్య వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పాటు పడిపోయాడు. బావిలో నీరు లోతుగా ఉన్నందున రమేష్ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో ట్రాక్టర్‌ను, రమేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జానకిరాములు తెలిపారు.

నిద్రలో దడదడ

● రహదారిపై రంబుల్ స్ట్రిప్స్‌తో విపరీతమైన శబ్దాలు


● కంటినిండా నిద్రలేక ప్రజల అవస్థలు



మునగాలలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్తోన్న వాహనాలు

మునగాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేగ నియంత్రణతో పాటు డ్రైవర్ల నిద్రమత్తును వదిలించేలా రహదారులపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్(కొద్దిపాటి మందంతో కూడిన పట్టి) సమీపంలోని ప్రజలకు నిద్రపట్టనివ్వడం లేదు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65వ నెంబరు)పై పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు నిత్యం జరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనాలు నెమ్మదిగా, వన్‌వేగా వెళ్లాలనే ఉద్దేశంతో పోలీసులు స్టాప్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు తరుచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు హైవేపై మూడు లేయర్లుగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుచేశారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోనూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్లే వాహనాలు చేసే దడ దడా శబ్దానికి సమీపంలోని నివాస ప్రజలకు రాత్రి పూట కంటినిండా నిద్రపట్టక నానా అవస్థలుపడుతున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో ఈ రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో వాహనాల శబ్దాలతో పిల్లలు, చిన్నారులు నిద్రపోవడం లేదని స్థానికులు తెలిపారు. వేగ నియంత్రణకు గ్రామశివారులోనే ఈ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలంటున్నారు. ఊరులో మధ్యంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర మంతి గట్కరీ రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని స్థానికులు తెలిపారు.

వాహనాల శబ్దంతో నిద్రలేక ఇబ్బందులు పడుతున్నాం



రంబుల్ స్ట్రిప్స్ వద్ద వాహనాల శబ్దంతో రాత్రి పూట నిద్రపట్టటం లేదు. జన నివాసాల మధ్య స్ట్రిప్స్ ఏర్పాటు మంచిది కాదు. ఊరు శివారులో ఏర్పాటుచేయాలి. రోడ్డు వెంట ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు శబ్దాలు వినలేక ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు వణికిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి తొలగించాలి.

కొప్పుల నర్సింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు

వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి



రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో కార్లు, భారీ వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి. ఒక్క లేయర్ వేస్తే స్పీడ్ కంట్రోల్‌లోకి వస్తుంది.మూడు లేయర్లు వేయటం సరి కాదు. ఈ స్ట్రిప్స్ వల్ల వస్తున్న శబ్దాలతో చెవులకు చిల్లులు పడే పరిస్థితి ఏర్పడింది. గ్రామం శివారులో ఏర్పాటు చేయాలి, అధికారులు పునరాలోచన చేసి వాటని తొలగించాలి.

బంగారపు సత్యం, మునగాల

అనాథ ఆశ్రమానికి పరుపుల వితరణ



చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమానికి పరుపులు అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

నల్లగొండ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రం శివారు పానగల్‌లోని చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ తరఫున 20 మందికి బుధవారం పరుపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. పుల్లారావు సీనియర్ ఐఎంఏ డాక్టర్ ఏవీ. శ్రీనివాసరావు, నీలగిరి బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య, నరేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మూగజీవికి ప్రాణం పోసి..

కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో గేదెకు అరుదైన శస్త్ర చికిత్స



గేదెకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

కోదాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో బుధవారం గేదెకు అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామానికి చెందిన వెంకటరమణ పాడిగేదె ఆదివారం మేతకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కింది దవడ ఎముక విరిగి దంతాల ప్యాడ్ కూడా పెదవి నుంచి విడిపోయింది. గేదె నోటి ఎముక దంతాలు విరగడంతో మేత, నీరులేక రెండు రోజులుగా బాధపడుతోంది. చికిత్స నిమిత్తం గేదెను బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చంద్రమోహన్, డెంటిస్ట్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావుల సహకారంతో దవడ గేదె ఎముకకు డ్రిల్లింగ్ చేసి స్టెయిన్‌లెస్ స్టీల్ వైరుతో దవడ ఎముకకి, పంటి పలుకకు కుట్లు వేసి మత్తుద్వారా గేదె ఏడు నెలల సూడికి నష్టం జరగకుండా కింది పెదవి ఎముకను, దంతాలను విజయవంతంగా అతికించారు. ఆపరేషన్ తర్వాత గేదె స్వతహాగా నీరు తాగడంతో పాటు ఆహారం తీసుకుంటుందని రైతు తెలిపారు. ఆపరేషన్‌కు కాపుగల్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సురేంద్ర, సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్ సహకరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

వేములపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శి వారులోని బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నామిరెడ్డి అరవింద్‌రెడ్డి(25) తన కారులో రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరాడు. శెట్టిపాలెం శివారులోని చిత్రపరక వాగు సమీపంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అరవింద్‌రెడ్డి నామిరెడ్డి, పుల్లారెడ్డి సునీతల ఏకైక కుమారుడు. అరవింద్‌రెడ్డి బీబీఏ పూర్తి చేసి ఎంబీఏ కోసం సిద్ధమతున్నాడని తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పోచంపల్లిలో ఆఫ్రికన్ ప్రతినిధులు

● పోచంపల్లి టూరిజం సెంటర్‌ను సందర్శించిన 30మంది ప్రతినిధులు ● ఇక్కత్ డిజైన్లను పరిశీలించి అబ్బురపడిన యువతులు





భూదాన్‌పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ వద్ద ఆఫ్రికన్ ప్రతినిధులు, రాట్నం తిప్పుతున్న ఆఫ్రికన్ యువతి

భూదాన్‌పోచంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో ఆఫ్రికా ఖండంలోని 15దేశాలకు చెందిన 30మంది ప్రతినిధులు బుధవారం పర్యటించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆఫ్రికా ఖండంలోని 15మధ్య పశ్చిమ ఆఫ్రికన్ దేశాల 30 మంది సోషల్ మీడియా, కంటెంట్ క్రియేటర్లు పోచంపల్లి పర్యాటక గ్రామాన్ని సందర్శించారు. స్థానిక సాంస్కృతిక కళలతో, మ్యూజిక్‌తో మమేకమయ్యారు. ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని పర్యాటక మ్యూజియంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇక్కత్ తయారీ విధానాన్ని పరిశీలించిన అతిథులు నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. 'ఒక్క చీరకు వారం రోజులపాటు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత' వారి మనస్సును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథుల్లో కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు. అనంతరం వారు పోచంపల్లి ఇక్కత్ చీరల తయారీని పరిశీలించారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో చాటుతామన్నారు. మరికొందరు చీరలు కొనుగోలు చేశారు. అనంతరం వారు రామోజీ ఫిలింసిటీకి బయల్దేరి వెళ్లారు.

వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలి

ఎగుమతుల ప్రమోషన్ కార్యక్రమంతో పోచంపల్లి వస్త్ర పరిశ్రమ వారసత్వ నైపుణ్యాలను కాపాడుకోడంతోపాటు పారిశ్రామికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీటీపీసీ (తెలంగాణస్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్) సంయుక్తంగా ఎంఎస్ఎంఈల(టెక్స్‌టైల్ రంగంలోని) అంతర్జాతీయ ఎగుమతులు పెంపొందించేందుకు ఆర్ఏఎంపీ కార్యక్రమం నిర్వహించారు. రైజింగ్ యాక్సెసరీ అండ్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం - ఆర్ఏఎంపీ పథకాన్ని భారత ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ సహకారంతో ప్రారంభించింది. జీఐ ట్యాగ్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ టెక్నాలజీని, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తేవడం ద్వారా ప్రాంతీయ ప్రజలు సమూహంగా, సమష్టిగా ప్రయోజనాన్ని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో భారత లవకుమార్, ఫారిన్ ట్రేడ్ డెవలప్‌మెంట్ రిటైర్డ్ ఆఫీసర్ పీఎస్‌బీ శాస్త్రి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, జంగయ్య, అంతర్జాతీయ ఎగుమతుల ఎక్స్‌పర్ట్ శ్రీదేవి, శివకుమార్, బాలకృష్ణ, జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దీపిక పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం.. దక్షిణాది మూలాలు పదిలం!



యోవానీనాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్‌గా దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారత దేశ పర్యటనలో భాగంగా హైదారాబాద్‌కు చేరుకున్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆఫ్రికా ఖండంలోని 15 దేశాలకు చెందిన 30మంది భారత దేశ పర్యటనలో ఆమె మార్గదర్శనం చేశారు. నాలుగు రోజుల క్రితం వారితో హైదరాబాద్‌కు చేరుకున్నారు. యోవానీ నాయుడు పేరులోనే కాదు.. ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం, భారతీయత ఉట్టిపడుతోంది. తండ్రి తెలుగు వ్యక్తి కాగా, తల్లిది తమిళనాడు. వారి పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికా వలస వెళ్లారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్ నివాసి. తాను ఆరో తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగు, తమళనాడు భాషలు రాకున్నా.. సంస్కృతి, సంప్రదాయాలకు దూరం కాలేదు. కట్టు, బొట్టు, సంప్రదాయ దుస్తుల్లో ఉంటూ.. స్థానిక భారతీయురాలిలాగే కనిపిస్తుంది యోవానీ నాయుడు. ఆమె సైంటిస్టుగా పనిచేస్తున్న వెస్టన్, ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజెను ప్రమోటింగ్ చేస్తుంది. తెలుగు పాటలు చక్కగా పాడే ఆమె టాలీవుడ్, కోలీవుడ్‌లకు గ్రేట్ ఫ్యాన్ అంటూ దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించడం తనకు గర్వంగా ఉందన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూవులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.30,83,173 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. మధుసూదన్‌రావు దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా వేర్వేరుగా యాదగిరిగుట్టకు వచ్చారు. గర్భాలయంలోని స్వయంభూవులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేశారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామి నిత్య కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణం నిర్వహించారు. నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి,సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, రాజష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చింతపల్లి ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): సాయినాథుడి అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో 18వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆలయంలో 300 గోవులను పెంచి ధర్మసంస్థాపనకు ట్రస్టు చైర్మన్, సభ్యుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, టీవీఎన్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, ఎల్లంకి అశోక్, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, వందనపు అంజనేయులు, ఎండి.ఖలేద్, సీమర్ల శ్రీను పాల్గొన్నారు. ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామి, చండీఉపాసకుడు కొడకండ్ల రామచరణ్‌శర్మ, శానగొండ శివకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వాస్తు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి వెంకటయ్య, వూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: షిర్డీసాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర

నాగార్జునసాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.60
టీఎంసీలు	136.1274
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	5,598
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	96,324
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	6,498 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.43 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	638.50 అడుగులు
టీఎంసీలు	2.88
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	1812. 14 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	91.35 క్యూసెక్కులు

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

నల్లగొండ, శాలిగౌరారం, కేతేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ జిల్లా గుండపల్లి మండలం సింగరాజుపల్లిలో అత్యధికంగా 2.2 సెంటీమీటర్లు, అత్యల్పంగా చందంపేటలో 0.8మిల్లీమీటర్లు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 1.3 మిల్లీమీటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల నుంచి వస్తున్న వరదకు మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో జలకళ సంతరించుకుంది. నది పరివాహక గ్రామాలైన ఉప్పలంచ, మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి వద్ద బాగా మూసీనది ప్రవహిస్తోంది.

639 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

అల్పపీడణ ద్రోణి ప్రభావంతో ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలు హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ దిశగా పయనిస్తోంది. నెల రోజులకు పైగా ఐదారు వందల క్యూసెక్కులుగా నిలకడగా ఉంటున్న ఇన్‌ఫ్లో బుధవారం 1812 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు ఎగువ మూసీ పరివాహక గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు క్రమంగా దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 639అడుగులకు (2.89టీఎంసీలు)చేరింది. వేసవిలోనే ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుండడంతో ఆయకట్టు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణికి రుతుపవనాలు తోడవడంతో వచ్చే నాలుగైదు రోజులు వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో జూన్ తొలివారంలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరే వీలు ఉందని రైతులు చర్చించుకుంటున్నారు.

ఎల్లమ్మతల్లీ.. దీవించు



ఎల్లమ్మ తల్లి ద్వారానికి భక్తులు కట్టిన తొట్టెల ముడుపులు

ఆ తల్లిని వేడుకుంటే కోర్కెలు తీరినట్టే.. తొట్టెల ముడుపు కడితే 'కడుపు' పండినట్టే..! ఇదీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గుట్టపైన వెలసిన (బావని) ఎల్లమ్మ దేవత పట్ల మహిళలకు ఉన్న విశ్వాసం. అందుకే కొత్తగా నవ దంపతులు లేదా పెళ్లి అయి ఏళ్ల గడిచినా సంతాన భాగ్యానికి నోచని దంపతులు చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్నారు. 'అమ్మా'..అనే పిలుపు కోసం ఆరాటపడుతున్నారు. మాతృత్వపు వరాన్ని కోరుతూ 'తొట్టెల'ను ముడుపుగా కడుతున్నారు. కడుపు పండించమని తల్లిని మొక్కుకుంటున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)

ఎంజీయూ డిగ్రీ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు చిట్టచివరి సారి అవకాశం కల్పించి మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు సీవోఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గడ్డిపల్లి పాలిటెక్నిక్ ఇన్ హార్టికల్చర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఘంటా సత్యనారాయణరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి హార్టికల్చర్ ఇన్ పాలిటెక్నిక్ కళాశాలలో హార్టికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం సమత కంపెనీ ఆధ్వర్యంలో హార్టికల్చర్ కార్యదరి స్నేహలత పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, సోము బాల చౌడరెడ్డి, జోనల్ హెడ్ ఎం. సాయి, రీజనల్ మార్కెటింగ్, మేనేజర్ కళాశాల ఇన్‌చార్జి సీహెచ్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కాలం.. మొలకెత్తిన విత్తనం

● సిద్ధం చేసిన దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులు



మోత్కూరులో మొలకెత్తిన పత్తి విత్తనాలు

మోత్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఒకట్రెండు వర్షాలకు విత్తనాలు విత్తరు. ఒక వేళ విత్తితే ఎండలకు విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే వట్టిపోతాయి. కాని సారి కత్తెర చివరి పాదం నుంచి రోహిణిలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మే నెలలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు మెట్ట పంటల సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసి పెట్టుకున్నారు. కత్తెర కార్తెలో ఈ నెల 21న వర్షం కురియడంతో యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో దుక్కులు సిద్ధం చేసి పెట్టుకున్న రైతుల్లో కొందరు ధైర్యం చేసి ఈ నెల 22న పత్తి విత్తనాలు విత్తారు. ఈ నెల 25నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. రోహిణిలోనూ వర్షాలు కురుస్తుండడంతో కత్తెర కార్తె చివరి పాదంలో విత్తిన పత్తి విత్తనాలు శ్రేష్ఠంగా మొలకెత్తాయి. రోహిణిలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికి దుక్కులు సిద్ధం చేయని రైతులు ఈ వర్షాలకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. ముందుగా విత్తనాలు విత్తడం వల్ల నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు లేకపోయినా అప్పటికే పత్తి దిగుబడి చేతికి వస్తుందని, నష్టం జరగదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు కురిస్తే తమకు రెండో పంట కూడా వస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురియడం లాభదాయకంగానే ఉంటుందంటున్నారు. ఈ వర్షాలకు బలమైన కార్తెలో విత్తనాలు విత్తడంతో పాటు, గొర్రెలు, పశువులకు త్వరగా పచ్చగడ్డి దొరుకుందని, వానాకాలం వరి పంటకు ఈ కార్తెలోనే నార్లు కూడా పోసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు ముందుగా కురిసిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేస్తే మాత్రం నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు రైతులు.

పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి



బలమైన కార్తె అన్న భావనతో ఈ నెల 21న కురిసిన వర్షానికి నేను పది ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాను. నేను విత్తనాలు విత్తిన తర్వాత కూడా వర్షాలు కురియడంతో పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి. రోహిణి కార్తెలో కురుస్తున్న వర్షాలకు చాలామంది రైతులు విత్తనాలు విత్తుతున్నారు. నేను ధైర్యం చేసి ముందుగా విత్తనాలు విత్తినందుకు వర్షాలు కురవడం కలిసొచ్చింది.

● మర్రి మధు, పత్తిరైతు, మోత్కూరు.

పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

హుజూర్‌నగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో సామాహిక పుట్టినరోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సన్మానించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సోమయ్య, ఎంఎస్ఎన్ రాజు, ఉసా రవికుమార్, దేవదానం, పురుషోత్తమ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

తుంగతుర్తి, మే 28, (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని వీఎన్ భవన్‌లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురిసి ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి మొలకలు వస్తున్నందున రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుర్ర శ్రీనివాస్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

నాగారం, మే 28(ఆంధ్రజ్యోతి): నాగారం తహసీల్దార్‌గా ఎం.హరికిషోర్‌శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు(ఎస్) నుంచి బదిలీపై నాగారానికి వచ్చారు. నాగారం తహసీల్దార్‌గా పనిచేసిన వి. బ్రహ్మయ్య యాదాద్రి భువనగిరికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా హరికిషోర్‌శర్మ మాట్లాడుతూ రైతులకుఎదురైతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ నసీమాబేగం, ఎంపీఎస్‌వో రమేష్, ఆర్ఐ అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

ఏసయ్య మృతి బాధాకరం

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేటలోని ప్రముఖ వైద్యుడు సునీల్‌కుమార్ తండ్రి ఏసయ్య మృతి బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ్‌ష్‌రెడ్డి అన్నారు. ఏసయ్య జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ సునీల్‌కుమార్ నివాసంలో ఏసయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, జీవన్‌రెడ్డి, మారిపెద్ది శ్రీనివా్‌సగౌడ్, ఊడి నర్సింహ్మారావు, మర్ల చంద్రారెడ్డి, బాచ్‌పల్లి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బసవయ్య

కోదాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు ముండ్రా బసవయ్య అని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల సీతారామయ్య అన్నారు. రిటైర్డు ఉపాధ్యాయుడు, కవి రచయిత, గాయకుడు, నటుడు ముండ్రా బసవయ్య సంతాప సభను బుధవారం మండలంలోని దొరకుంట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, శ్రీనివాసరావు, ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి

హుజూర్‌నగర్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధి' కూలీలకు కూలిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కర్షక్ లగడపాటి వెంకట్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని కూలీలతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఉపాధి' కూలీలకు రెండు నెలల కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో తేట అమ్మతనాయుడు, సంధ్యారాణి, షఫీయా, నాగాచారి, వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నేరేడుచర్ల, మే 28(ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎస్ఐ రవీందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్నపల్లి శ్రీను, కొణతం కృష్ణారెడ్డి, చిట్యాల శ్రీను, గానుగుబండ వెంకటేశ్వర్లు, యడవల్లి సత్యనారాయణరెడ్డి, కృష్ణ సైదులు, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మోహన్‌రావు, యాదవ సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

పెన్‌పహాడ్, మఠంపల్లి మే 28(ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పెన్‌పహాడ్, మఠంపల్లి మండలాల వ్యవసాయాధికారులు అనిల్‌నాయక్, శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 30కిలోల విత్తనాల బస్తా 50శాతం సబ్సిడీతో రూ.2137లకు అందజేస్తున్నామన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్ జిరాక్స్ ప్రతులతో మండల వ్యవసాయాధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి

హుజూర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్, పట్టణ అధ్యక్షుడు ఎ.వీరబాబు కోరారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని పరిశీలించి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్‌తో మాట్లాడారు. రోగులకు సరైన సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎండీ, ఎంఎస్, ఆర్థోపెడిక్, సివిల్ సర్జన్ వంటి అనేక కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గైనకాలజిస్టులు కూడా సక్రమంగా లేరన్నారు. . కార్యక్రమంలో నరేష్, అనిల్, అబ్రహం, నర్సింహారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మఠంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంబోడుతండా గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం వి.వెంకటేశ్వర్లు తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ బుధవారం ఆటో ద్వారా ప్రచారం నిర్వహించి మాట్లాడారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

● ఎక్కడి చెత్త అక్కడే ● రోడ్లపైన ప్రవహిస్తున్న మురుగునీరు ● ఆవేదన వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



సూర్యాపేటలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

సూర్యాపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. సరైన నిర్వహణ లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనందున జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి ఎంజీ రోడ్డు మహాత్మాగాంధీ విగ్రహం వరకు మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీనికి తోడు ఏ చిన్న వర్షం కురిసినా మురుగు నీరు వరద నీటి కాల్వల్లోకి వెళ్ల కుండా రోడ్డు పైనే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది తప్పడంలేదు. ముఖ్యంగా ఈ రహదారిపై వాణిజ్య దుకాణాలు ఉన్నందున ప్రజల రద్దీ అధికంగా ఉంటోంది. మురుగు నీటిని దాటి దుకాణాలకు రావాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీటి ప్రవాహంతో దుర్వాసన వస్తున్నందున స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

చెత్త రోజుల తరబడి అక్కడే..

మురుగు కాల్వల్లో చెత్తను తీసి అక్కడే వేస్తున్నారు. ఈ చెత్తను ఒక్కోసారి నాలుగు రోజుల వరకు తీయనందున దుర్వాసన వస్తోంది. దీనికి తోడు దానిన్న వానా కాలం దృష్ట్యా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో షీల్డ్ పనుల్లో భాగంగా మురుగుకాల్వల్లో చెత్తను తీసి రోజుల తరబడి అక్కడే ఉంచుతున్నందున చిన్నపాటి వర్షం కురిసినా ఆ చెత్త తిరిగి కాల్వల్లోకి వెళుతోంది. ఈ విషయాన్ని మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికుల దృష్టికి తీసుకువెళ్లినా షీల్డ్ పనుల నిర్వాహకులు తీస్తారని చెబుతూ పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. మురుగు కాల్వల్లో చెత్తపేరుకుని దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శ్రద్ధ తీసుకుని మురుగు కాల్వలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై చెత్తతో దుర్వాసన

మురుగు కాల్వల నుంచి తీసిన చెత్తను నాలుగైదు రోజుల వరకు తీయనందున దుర్వాసన వస్తోంది. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నందున ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.



● వినీత్, సూర్యాపేట

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేసి సహకరించాలి.

● బి.శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్

అపరిశుభ్రంగా వ్యవసాయ మార్కెట్



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న దృశ్యం

భానుపురి: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. 14 షెడ్ల సమీపంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే కనబడుతున్నాయి. నీటి నల్లాలు ఉన్న ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. ఎమార్కెట్ ప్రాంగణంలో గడ్డి, చెత్తాచెదారం కనబడుతోంది. మార్కెట్ ప్రాంగణంలోనే పశువుల సంత ఉంది. ఈ సంతకు ప్రతి సోమవారం వేకువజామున మూడు గంటల నుంచే రైతులు దూర ప్రాంతాల నుంచి పశువులను తీసుకువస్తుంటారు. సంత చిమ్మచీకటిగా ఉంటోందని, తేళ్లు, పాములు ఉంటున్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. ఈ సంత ద్వారా ఆదాయం కోసం పాకులాడే అధికారులు, సిబ్బంది వెంపర్లాడటం మినహా పరిశుభ్రత, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది నుంచి జిల్లా మార్కెట్ అధికారి కార్యాలయాన్ని రైతు విశ్రాంతి భవనంలోనే నిర్వహిస్తున్నారు. అధికారులు, సిబ్బంది మార్కెట్ వాతావరణాన్ని పట్టించుకోవడంలేదని, వెట్ సోర్టింగ్ సిబ్బందితోనైనా పరిశుభ్రతపై దృష్టి సారించడంలేదని రైతులు తెలిపారు. వర్షాలు కురిస్తే రైతు ధాన్యం కుప్పలపై పెట్టుకునే రాళ్లు కూడా మార్కెట్ ప్రాంగణంలో చిందరవందరగా కనిపిస్తున్నాయి. వ్యాపారుల మార్కెట్లో ఉండే దేవాలయాన్ని ఎంతో పరిశుభ్రంగా, పవిత్రంగా చూసుకుంటున్నారని, అదే విధంగా మార్కెట్‌పై ఎందుకు దృష్టి సారించడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయించాం



మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలో మురుగు కాల్వలను శుభ్రం చేయించాం. పశువుల సంత వైపు చేయలేదు. మార్కెట్‌లో ఉన్న చెత్తచెదారం తొలగిస్తాం. అక్కడక్కడ ఉన్న రాళ్లను తీయించా.. నల్లాల వద్ద మురుగు నీరు లేకుండా చేశాం. పశువుల సంతలో విద్యుత్ దీపాలు వేయిస్తాం.

● సంతోష్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు

మునగాల, నేరేడుచర్ల, పాలకవీడు, కోదాడ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తా మని సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మునగాలలోని ఎరువుల దుకాణాలను మండల ఏవో బి.రాజు ఎస్ఐతో కలిసి ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో రైతులు రసీదు తీసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చలసాని ప్రసాద్, రాంరెడ్డి, ఉప్పల యుగంధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

● రైతులకు నకిలీ ఎరువులు, నాసిరకం విత్తనాలు విక్రయించే వ్యాపారులపై పీడీ యాక్టు కేసు నమోదు చేయిస్తామని నేరేడుచర్ల తహసీల్దార్ సరిగ సైదులు హెచ్చరించారు. బుధవారం నేరేడుచర్ల పట్టణంలో ఎస్ఐ రవీందర్, వ్యవసాయాధికారి జావిద్‌తో కలిసి దుకాణాలను తనిఖీ చేశారు. .

● రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాలకవీడు మండల ప్రత్యేకాధికారి శంకర్ హెచ్చరించారు. బుధవారం పాలకవీడులో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి విత్తనాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. బీటీ-3 పత్తి విత్తనాలు విక్రయించినా, సాగు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.లక్ష్మణచక్రవర్తి, ఎంపీఓ లక్ష్మీ, ఎఈఓ లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఆర్ఐ సూర్యనారాయణ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్స్ పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఏవో రజిని, తహసీల్దార్ వాజిద్‌అలీ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి



సూర్యాపేటలో కేక్‌కట్ చేస్తున్న ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడైన ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని సూర్యాపేట ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు నేరేళ్ల మధుగౌడ్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం సూర్యాపేటలోని నల్లాలబావి ఆవరణలో కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి కళ్యాణ్‌చక్రవర్తి, గోపగాని గిరిగౌడ్, కొండగుడుపుల సూరయ్య, చల్లా శ్రీరాములు, గుణగంటి మధు, కారింగుల వేణు, రాజేష్, పోలగాని ఉపేందర్, ఏల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● బడుగు, బలహీన వర్గాల ఎన్నిక ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ మాజీ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. బుధవారం కోదాడలో టీడీపీ, కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుళ్లపల్లి సురేష్, కొల్లు నర్సయ్య, దేవల శ్రీను, కొల్లు సత్యనారాయణ, గుండు నాగేశ్వరరావు, నెల్లూరు వెంకటేశ్వర్లు, ముండ్ర రవి, కోదాటి రేవంత్‌రెడ్డి, పెదనాటి వెంకటేశ్వరరావు, వేమూరి సురేష్, ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ల సీతారామయ్య, జాస్తి సుబ్బారావు, పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని దొరకుంట, నల్లబండగూడెం గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దొరకుంట మాజీ సర్పంచ్ ముత్తవరపు ఆంద్రజ్యోతి, శోభన్‌బాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నల్లబండగూడెంలో మాజీ సర్పంచ్ ముండ్రా రంగారావు, మేకల ప్రతాప్, ముండ్రా వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతగిరి మండల ఖానాపురం గ్రామంలో జొన్నలగడ్డ నాగేశ్వరరావు, రంగారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు.

● నేరేడుచర్లలోని ప్రధాన కూడలిలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, చావా వీరభద్రరావు, కొణతం ఆదిరెడ్డి, తాటికొండ శ్రీరాంరెడ్డి, కె.నరేష్, నిమ్మగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● చిలుకూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, కొల్లు నర్సయ్య, గురవయ్య, వీరబాబు, మరీదు శ్రీను పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లుగౌడ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, రోషపతి, నాగయ్య, సురేష్, మస్తాన్, రాములు, కోటయ్య, నాగులమీరా, సైదులు, వెంకన్న, రాములు, కొండలు, అంజమ్మ, లక్ష్మి సామ్రాజ్యం పాల్గొన్నారు.

● మేళ్లచెర్వులో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుల సురేష్, బండారుపల్లి రామకృష్ణ, గజ్జెల వెంకటేశ్వర్లు, కమతం సత్యనారాయణ, వీరభద్రరావు, శంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



కోదాడలో మాట్లాడుతున్న ముత్తినేని సైదేశ్వరరావు

● సూర్యాపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి ప్రముఖ కవి, రిటైర్డు అధ్యాపకుడు హమీద్‌ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుర్రి వెంకటేశ్వర్లు, బండి రాధాకృష్ణారెడ్డి, దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణసింగ్, అనిల్, సాయి, వీరు పద్య, వెంకటేశ్వర్లు, ఆనిరుధ్ పాల్గొన్నారు.

● గరిడేపల్లిలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో టీడీపీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మండవ వెంకటేశ్వర్లుగౌడ్, కీసరి నాగయ్య, గుగులోతు రవినాయక్, పశ్య సీతారామిరెడ్డి, పాండునాయక్, బండ్ల ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.




మేళ్లచెర్వులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నీ ఆస్తులకేదీ రక్షణ?

(5వ పేజీ తరువాయి)

అధికారులు,నాయకులకు మామూళ్లు ముట్టజెప్పి నాణ్యతలేని పనులు చేస్తున్నారని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

వేలం పాటలు దుర్వినియోగం కాకుండా చూడాలి



మునిసిపాలిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేలం పాటల ద్వారా వచ్చే ఆదాయం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత పెద్దగట్టు జాతరకు రూ.11 కోట్లు కేటాయించింది. పెద్దగట్టు పైభాగం, కింది భాగంలో నిర్వహించే వేలం పాటలు దేవాలయానికి చెందాలి. వ్యాపారుల వేలం పాటల్లో సిండికేట్ కాకుండా చూడాలి.

● మద్ది శ్రీనివాస్‌యాదవ్, పెద్దగట్టు మాజీ చైర్మన్

కాంట్రాక్టర్లకు అప్పగిస్తాం



పెద్దగట్టు కింది భాగంలో నిర్వహించే వేలం పాటలు సూర్యాపేట మునిసిపాలిటీకే వస్తాయి. లైటింగ్, రోడ్లను, శానిటేషన్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తాం. కొబ్బరికాయలు, నర్సుల ఇతరవాటి వేలం పాటలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జనవరిలో వేలం నిర్వహిస్తాం. నిధుల కావాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం.పెద్ద గ్రైవేట్ వ్యక్తులకు ఇవ్వలేదు. భక్తుల వాడుకుంటున్నారు.

● శ్రీనివాసారావు, సూర్యాపేట మునిసిపాలిటీ కమిషనర్

న్యాయవాదులపై దాడులు హేయం

కోదాడ టౌన్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), మే 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులు చేయడం హేయమైన చర్య అని కోదాడ బార్ అసోసియేషన్ కార్యదర్శి రామిరెడ్డి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఉయ్యాల నరసయ్య అన్నారు. అడ్వకేట్ బానోత్ ప్రతాప్‌పై దాడికి నిరసనగా బుధవారం కోదాడ కోర్టులో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు,ఉసిరికాయల రవికుమార్, యశ్వంత్, రామారావు, ఉదారు శ్రీనివాస్, జానీపాషా, బండి వీరభద్రరావు, దావీదు, బిగ్‌వర్లన్, హేమలత, తాటి మురళి, శరత్‌కుమార్, పాల్గొన్నారు.

● తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న బానోత్ ప్రతాప్‌నాయక్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెవర్తి జ్ఞానసుందర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధుల బహిష్కరించి నిరసన తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, జిల్లా కుమారస్వామి, జిలకర చంద్రమౌళి, గుగులోతు రాజారాం నాయక్ పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

తుంగతుర్తి, హుజూర్‌నగర్, మే 28, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని గొట్టిపర్తి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో తాటికొండ సీతయ్య, గుండగాని రాములు గౌడ్, దుగ్యాల రవీందర్‌రావు, తడకమళ్ళ రవికుమార్, బొజ్జ సాయి కిరణ్, తెట్టు హరిబాబు పాల్గొన్నారు.

● కృష్ణా, గోదావరి జలాల కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆరోపించారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన నీటిని రాబట్టడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శిం చారు. ఈ సమావేశంలో కొప్పుల సైదిరెడ్డి, కేఎల్ఎన్ రెడ్డి, కడియం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించడానికి ఐవీవో కృషి అభినందనీయం



కోదాడలో 100 అడుగుల జాతీయ జెండాను సందర్శించిన సినీ హీరో సుమన్

కోదాడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీవో) చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీ హీరో సుమన్ అన్నారు. కోదాడలోని సింగారం గ్రామానికి వెళ్లే దారిలో ఐవీవో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 100 అడుగుల జాతీయ జెండాను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆర్మీలో సేవలు అందించి ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంతి తీసుకోకుండా ఐవీవో ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను ఆ కొనియాడారు. అనంతరం పహల్గాంలో మృతి చెందిన దేశ పౌరులకు, ఆపరేషన్ సిందూర్‌లో మృతిచెందిన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఐవీవో సభ్యులు సుమన్‌కు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. హీరో సుమన్‌ను ఐవీవో స్టేట్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు ఆమోదంతో నియమించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్, ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ సామినేని ప్రమీల, పిల్లల డాక్టర్ మధుసూదన్‌రావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కే వెంకన్న, మహదేవ్, పీస్, జిల్లా కోఆర్డినేటర్ షేక్ రహీం, స్టాలిన్, నాగార్జున, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు

ఉన్నత చదువులతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సినీ హీరో సుమన్ అన్నారు. విజయావిజన్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 15మంది విద్యార్థులకు బుధవారం కోదాడలో ప్రతిభా అవార్డులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పేద విద్యార్థులకు విజయావిజన్ ట్రస్టు ప్రతిభా అవార్డులు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. దేశభక్తిని పెంపొందించేందుకు ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీవో) చేస్తున్న సేవా కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయావిజన్ ట్రస్టు వ్యవస్థాపకుడు చారుగండ్ల రాజశేఖర్, వంగవీటి లోకేష్, చెన్నకేశవరావు, వైద్యుడు జాస్తి సుబ్బారావు, కిట్స్ కళాశాల చైర్మన్ నీల సత్యనారాయణ, పైడిమర్రి సత్యబాబు, పబ్బా గీత, రవీందర్‌రావు, సామినేని ప్రమీల, మధుసూదన్, స్టాలిన్ నాగార్జున పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు చేయాలి: సీపీఐ

హుజూర్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే గుర్తింపు ఉంటుందన్నారు. పేదలకు ఏ కష్టం వచ్చినా ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. మోదీ దేశ విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌వాళ్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభలో గుండు వెంకటేశ్వర్లు, యం.వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్‌యాదవ్, జక్కుల రమేష్, సుందరి వెంకటేశ్వర్లు, పద్మ, మామిడి వెంకయ్య, కొప్పోజు సూర్యనారాయణ, నారాయణరెడ్డి, దనుంజయనాయుడు, మల్లేశ్వరి, వెంకటేశ్వర్లు, వెంకన్న, నర్సయ్య, స్టాలిన్, సైదులు పాల్గొన్నారు.

బడ్డీ కొట్టు వ్యాపారుల నిరసన

కోదాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) మండలంలో బడ్డీ కొట్టు వ్యాపారులు నిరసన తెలిపారు. నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రభుత్వం జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తోంది. పనుల్లో భాగంగా రోడ్డును విస్తరిస్తోంది. డ్రైనేజ్ సీసీ కాల్వలు నిర్మించేందుకు రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం డ్రైనేజ్ సీసీ కాల్వలు నిర్మించిన పక్కన ఉన్న గుంతలను పూడ్చనందున, గుంతల్లోకి నీరు చేరి తాము వ్యాపారాలు నిర్వహించుకోలేక పోతున్నామని వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, బాలరాజు, నారాయణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ వ్యవస్థపై పోరాడిన లింగయ్య

ఆత్మకూర్(ఎస్), మే 28(ఆంధ్రజ్యోతి): దోపిడీ వ్యవస్థపై విద్యార్థి నాయకుడు వీరబోయిన లింగన్న పోరాటం చేశారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందడి దేవేందర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన లింగయ్య అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే ప్రజా నేతగా లింగయ్య ఎదిగారని కొనియాడారు. లింగయ్య మృతికి గంట నాగయ్య, ఇందూరు సాగర్, కుంట్ల ధర్మార్జున్, కునుకుంట్ల సైదులు, బొమ్మ శంకర్, ఆలుగుబెల్లి వెంకటరెడ్డి, కంచనపల్లి సైదులు, జిలేరు, దేశోజు మధు, పోలెబోయిన కిరణ్, మధు, రాకేష్, సింహాద్రి, ఉమేష్, ఉదయగిరి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.